విశాలాంధ్ర కృష్ణా జిల్లా

భానుడి ఉగ్రరూపం

నిర్మానుష్యంగా ప్రధాన రహదారులు

విశాలాంధ్ర-కూచిపూడి : నాలుగు రోజులుగా భానుడు ఉగ్రతాండవం దాల్చుతున్నాడు. ఆదివారం వేడిగాలులతో కూడిన ఎండతో విజృంభించాడు. మధ్యాహ్నం 12 గంటలకు 38 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరింది. మధ్యాహ్నం ఒంటిగంటలకు 40 డిగ్రీలకు , రెండు గంటలకు 42 డిగ్రీలు, మూడు గంటలకు 44 డిగ్రీలకుకుచేరి వడగాలులు వీయటంతో బయటికి రావడానికి ప్రజలు భయపడ్డారు. సాయంత్రం 6 గంటలకు కూడా వేడిగా లులువీచడంతో ముఖ్యమైన పనులకు మాత్రమే జనాలుబజారుముఖం చూశారు.

లీలాకృష్ణకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-అవనిగడ్డ : అవనిగడ్డ చైల్డ్‌హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మోపిదేవి మండలం కె కొత్తపాలెం కు చెందిన పంచాయితీ క్లర్క్‌గా విధులు నిర్వహించి మంటాడ లో రిటైర్డ్ అయిన మత్తి సీతారామయ్య సామాజిక సేవే లక్ష్యంగా గ్రూప్ చేస్తున్న మంచి పనులకు తన వంతు సాయంగా తన నెల రోజుల పింఛన్ రూ.40,800 గ్రూప్ ప్రధాన కార్యదర్శి డి లీలాకృష్ణకు అందచేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌హుడ్ గ్రూప్ అవనిగడ్డ శాఖ అధ్యక్షులు అలపర్తి గోపాలకృష్ణ, బండె శ్రీను, అన్నపరెడ్డి కృష్ణ, కమ్మిలి ప్రసాద్, ఘంటా శ్రీనివాసరావు, యాసం శోభనబాబు, దామెర్ల ఏడుకొండలు, సామర్ల మహంత్, తుంగల మురళీ కృష్ణ, హనుమంత శ్రీనివాసరావు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులకు పోటెత్తుతున్న విద్యార్థులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : వేసవి శిక్షణా తరగతులకు విద్యార్థులు రోజురోజుకు పెరుగుతున్నారు. గ్రేడ్ 1 గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులలో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులు విద్యార్థులకు పుస్తక పఠనం, డ్యాన్స్, తెలుగు పద్యాలు, భగవత్ గీతా శ్లోకాలు, పాటలు పాడటం వంటి కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. గ్రేడ్ 1 గ్రంథాలయ అధికారి ప్రభుదాసు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రి కళాశాల అధ్యపకురాలు ఎ వీరకుమారి, ఎమ్. శేషగిరి రావు, గ్రంధాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువ కిషోర్ గుండెపోటుతో ఆకస్మిక మృతి



విశాలాంధ్ర-అవనిగడ్డ : అశ్వారావుపాలెం గ్రామానికి చెందిన విశ్వనాధుని యువ కిషోర్ (36) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. షంషాబాద్ ఎయిర్‌పోర్టులో సి.ఐ.ఎస్.ఎఫ్ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న మండల పరిధిలోని అశ్వారావుపాలెం గ్రామానికి చెందిన యువకిషోర్ తన ఇంటి వద్దే తీవ్ర గుండెపోటుతో మెట్లపై నుండి కింద పడిపోయారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. అశ్వరావుపాలెం గ్రామంలో సోమవారం యువ కిషోర్ మృతదేహానికి అధికార లాంచనాలతో అంతిమయాత్ర నిర్వహించనున్నట్లు సి.ఐ.ఎస్.ఎఫ్ బెటాలియన్ తెలిపారు. మృతి చెందిన యువ కిషోర్ కు భార్య ఇద్దరు ఆడపిల్లలు. కిషోర్ మృతి తో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆగష్టులో లక్ష మందితో యానాదుల మహాగర్జన సభ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ఆగష్టులో లక్ష మందితో యానాదుల మహా గర్జన సభ విజయవాడ వేదికగా ఆంధ్ర ప్రదేశ్ యానాదుల పొలిటికల్ ఫోరం తీర్మానం చేసింది. స్థానిక ఇంజనీర్స్ కే.యల్.రావు భవన్‌లో యానాదుల పొలిటికల్ ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 8 జిల్లాల నుంచి యానాది సంఘాల నాయకులు హాజరై చర్చించి పలు తీర్మానాలు చేశారు. యానాదులకు ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి. యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వాలి. యానాదులకు మైదాన ప్రాంతంలో జనరల్ స్థానంలో యమ్.యల్.ఎ సీటు కేటాయించాలి. యానాదులకు యమ్. యల్.సి ఇవ్వాలి. గిరిజనులకు రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించాలి. వైస్సార్ పెళ్లి కానుక నిబంధనలను సడలించాలి. నామినేటెడ్ పోస్టులలో యానాదులకు ప్రాధాన్యత ఇవ్వాలి అని. యానాది గర్జనలో రాజకీయ ప్రకటన విడుదల చేసేందుకు సన్నాహాలు రచించామన్నారు. అనంతరం యానాదుల పొలిటికల్ ఫోరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనర్లుగా కెసి పెంచలయ్య, యందేటి వెంకటసుబ్బయ్య, శేఖర్, రాచగిరి మధు, బాపట్ల నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకోవడమైనదని అన్నారు. అనంతరం యానాదుల పొలిటికల్ ఫోరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనర్లుగా కెసి పెంచలయ్య, యందేటి వెంకటసుబ్బయ్య, శేఖర్, రాచగిరి మధు, బాపట్ల నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య నాయకులు మేకల శ్రీనివాస చక్రవర్తి, యాకసిరి వెంకటేశ్వర్లు, చేవూరు సుబ్బారావు తదితర రాష్ట్ర, జిల్లా, నగర, యానాధ నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సహాయ సహకారాలు

విశాలాంధ్ర-గూడూరు: "నేతన్న కష్టాలను చూసి చలించిపోయి" చేనేత కార్మికుడికి ఎంతో కొంత సహాయం చేయాలని ఉద్దేశంతో "కలనేత చేనేత సంక్షేమ సంఘం" ఆధ్వర్యంలో "టు మేక్ ఏ డిఫరెన్స్ ఫౌండేషన్" సంస్థ ద్వారా ఆదివారం కప్పలదొడ్డి గ్రామంలో చేనేతకు సంబంధించిన ఖరీదైన 25 జాకార్డ్ మిషన్లను మరియు 30 మంది నిరుపేదలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టు మేక్ ఏ డిఫరెన్స్ ఫౌండేషన్ సభ్యులు జగదీశ్వర్ రావు, వరలక్ష్మి , కలనేత చేనేత సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు భూసం. లోకనాథం, గ్రామస్తులు పాల్గొన్నారు.

భానుడు భగభగ

రోడ్ల మీదుకు రావాలంటే భయం భయం

ఎండవేడికీ వృద్ధులు, చిన్నారులు అతలాకుతలం

విశాలాంధ్ర-గుడివాడ : రోజురోజుకి భానుడు భగ భగమంటూ తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మే నెల ప్రారంభంలో కురిసిన వర్షాలకు కొంత ఉపశమనం కలిగినప్పటికీ రెండు రోజులుగా భానుడు నిట్టనిలువునా కాస్తూ తన ప్రతాపాన్ని చూపించటంతో ప్రజలు అతలకుతలమై పోతున్నారు. ఉదయం 5గంటలకే సూర్యుడు ఉదయించి సాయంత్రం ఆరు గంటల వరకు విపరీతంగా ఎండలు కాయటంతో రోడ్లమీదకు రావాలంటేనే భయమేస్తుందని ప్రజలు తెలుపుతున్నారు. శని, ఆది వారాల్లో వేసిన ఎండ ఈ మధ్యకాలంలో ఎన్నడూ చూడలేదని ప్రజలు చెప్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉక్కపోత వాతావరణంతో ఊపిరి ఆగిపోతుందనే భయంతో ప్రజలు ఇళ్లనుంచి బయటికి రావాలంటే భయపడుతున్నారు. చిన్న సన్నకార వ్యాపారస్తులు తమ జీవనోపాధి కోసం ఎండల్లో సైతం తట్టలు నెత్తిమీద పెట్టుకుని మహిళలు మామిడి పండ్లు, పువ్వులు, ముంజలు తదితర వాటిని అమ్మకాలు చేస్తున్నారు. తోపుడు బండ్ల వ్యాపారస్తులు చెట్లనీడన నిలబడి ఉక్కపోత వాతావరణంలో ఎవరైనా తమ వద్ద పండ్లను కొనుగోలు చేయకపోతారా అని ఎదురు చూస్తున్నారు. అయితే ఎండ వేడిని తట్టుకోలేని ప్రజలు తోపుడు బండ్లపై కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపటం లేదు. ఇక రిక్షా, ఆటో, తాపీ, వడ్రంగి, పెయిటింగ్ ఇతర పనులు చేసే కార్మికులు ఎండల్లో పనులు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. రోహిణీ కార్తెని తలపించేలా ఎండలు కాయటంతో చిన్నారులు, వృద్ధులు ఎండవేడికీ అతలకుతలం అవుతున్నారు. పెళ్లి సీజన్ అయినప్పటికీ ఈ వేసవీలో పెళ్లిళ్ళు తక్కువగానే చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ఎండల వల్ల బంధువులకు పెళ్లి కబుర్లు చెప్పలేక చెప్పినప్పటికీ కొన్ని పెళ్లిళ్ళలకు బంధువులు రాకపోవటంతో పెళ్లికి చేసిన వంటకాలు మిగిలిపోతున్నాయి. ఎండల తీవ్రత తగ్గిన తరువాతే పెళ్లిళ్ళు చేసుకోవటం మంచిదని కొంతమంది పెళ్లిళ్ళు వాయిదా వేసుకున్న సంఘటనలు లేకపోలేదు. మే 15వ తేదీలోపే ఎండలు సుమారు 40డిగ్రీల పైబడి నమోదు కావటంతో ముందున్న కాలంలో ఎండలు ఏవిధంగా ఉంటాయోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఎంత ఎండలు వేసినప్పటికీ చెట్ల నీడన సేద తీరే ప్రజలకు రోడ్ల విస్తరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా చెట్లను తొలగించడంతో వాహనదారులకు ఇబ్బందులకు గురై అనారోగ్యాల పాలవుతున్నారనీ వాహనదారులు పేర్కొంటున్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ తాగునీరు సైతం వేడిగా ఉండటంతో చలివేంద్రాలలో నీరు తాగేందుకు ప్రజలు ఇష్టపడటం లేదు. దీనికి ప్రధాన కారణం కుండలలో నీరు నింపాల్సిన చలివేంద్రాలు ప్లాస్టిక్ టబ్‌లలో తాగునీరును నిలవనుంచి అందించటం వల్లే చలివేంద్రాలలో నీరు వేడిగా ఉంటుందని ప్రజలు తెలుపుతున్నారు. చలివేంద్రాల నిర్వాహకులు ఇప్పటికైనా కుండలల్లో నీరు ఉంచి అందిస్తే ప్రజలకు దాహార్తిని తీర్చిన వారవుతారు. ఆ దిశగా నిర్వాహకులు ముందుకు వెళ్ళాలని ప్రజలు కోరుతున్నారు. ఏదిఏమైనప్పటికీ ఈ ఏడాది ఎండలు ఇంకా ఏ విధంగా ఉంటాయో వేచి చూడాల్సిందే...

పట్టాభి స్మారక భవనాన్ని నిర్మించండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : స్వాతంత్ర సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి కృషి చేయాల్సిన పాలకులే విస్మరించడం సరికాదని మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. ఆదివారం జడ్పీ సెంటర్ లోని భోగరాజ పట్టాభి సీతారామయ్య విగ్రహం వద్ద అఖిలపక్ష,పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నంలో పట్టాభి స్మారక భవనం పనులు పాలకులు వెంటనే ప్రారంభించక పోతే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని, స్వాతంత్ర సమరయోధుడు, అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్ర బ్యాంకు మన మచిలీపట్నం కేంద్రంగా స్థాపించినటువంటి వ్యక్తి, ఆంధ్ర ఇన్సూరెన్స్ కంపెనీని స్థాపించినటువంటి మహానుభావుడు, కృష్ణ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ స్థాపించి రైతులకు ఎంతోమందికి ఉపయోగపడే విధంగా సేవలందిస్తున్న మహోన్నతమైన వ్యక్తి అయిన స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య విలువలకు మారుపేరైన మహనీయుడు ఆయన పేరు మీద మచిలీపట్నంలో నిర్మించే స్మారక భవనానికి పాలకులు అడ్డు తగలడం దురదృష్టకరం అన్నారు.భోగరాజు పట్టాభి సీతారామయ్య లాంటి మహానుభావుడు ని గర్వించగల వ్యక్తిగా మనం గుర్తించాలి అన్నారు. మన మచిలీపట్నం కేంద్రంగా ఆంధ్ర బ్యాంకు ను స్థాపించి దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా ఆంధ్రాబ్యాంక్ శాఖలను విస్తరింపచేసి ఉన్నత స్థితికి చేరుకునేటట్లు చేసిన మహనీయుడు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య అన్నారు.జనసేన పార్టీ మచిలీపట్నం ఇన్చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ పట్టాభి స్మారక భవన నిర్మాణానికి అఖిలపక్షం, పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన సమితి సభ్యులు పలుమార్లు జిల్లా కలెక్టర్ ను కలిసిన గత సంవత్సర కాలం నుండి పట్టించుకోకపోవడం దురదృష్టకరం అన్నారు. తొలుత పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన సమితి సభ్యులు భోగరాజు పట్టాభి సీతారామయ్య కాంస్య విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించి పట్టాభి స్మారక భవనం నిర్మాణ పనులను పాలకులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ విగ్రహం ఎదుట నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కే చంద్రశేఖర్, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు, గడ్డం రాజు, గుమ్మడి విద్యాసాగర్, కాసాని భాగ్య రావు, బోలెం అయోధ్య రామయ్య, పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన సమితి సభ్యులు, వేమూరి రామకృష్ణారావు, పి ఎస్ ఎస్ ఆర్ శర్మ, పి.వి. ఫణి కుమార్, అయినంపూడి రాజశేఖర్, కే సుబ్బారావు, గూడూరు మండలం మాజీ జెడ్పిటిసి, బూరగడ్డ శ్రీ కుమార్, కాగిత చంటి, తదితరులు పాల్గొన్నారు.

యువగళంకు మద్దతుగా పాదయాత్ర

విశాలాంధ్ర-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నూరు రోజులు యువగళం పాదయాత్ర పూర్తి అయిన సందర్భంగా పామర్రు నియోజకవర్గం మొవ్వ సెంటర్ నుండి కోసూరు వరకు సంఘీభావ పాదయాత్ర సోమవారం జరుగుతున్నందున మండలంలోని ప్రతి కార్యకర్త పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబులు ఆదివారం ఒక ప్రకటనలో టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని వాన పాముల గ్రామంలో వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమమును వానపాముల గ్రామంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ సామాన్య మానవుడు జీవించలేని పరిస్థితులు వైసీపీ పాలనలో కొనసాగుతుందని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.తదుపరి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతృమూర్తులకు స్వరహారతులు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : తెలుగు కళావాహిని,జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీకళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా జరిగిన సినీ సంగీత విభావరి మాతృమూర్తులకు స్వర హారతులందిస్తూ సాగింది. గాయనీ గాయకులుగా స్వాతి, రాజ్యలక్ష్మి, మీనాకుమారి,శ్రీ దుర్గా నాగమణి,శ్యాం ప్రసాద్,డేవిడ్ రాజు, ఆశయ్య, శివశంకర్, జగన్మోహనరావు తదితరులు అమ్మ అన్నది ఒక కమ్మని మాట, పెదవే పలికిన మాటల్లోనే తీయని మాటే అమ్మ, అమ్మా అని పిలిచినా ఆలకించవేమమ్మా, శ్రీ ఆంజనేయ ప్రసన్నాంజనేయ, జయ చిరంజీవ జగదేకవీర,రామ రామ రఘు రామ పరాత్పర వంటి ఆంజనేయులుపై పాటలను హృద్యంగా పాడి వినిపించారు. చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షించారు. అతిథులుగా విచ్చేసిన గోళ్ళ నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, డాక్టర్ చెట్లపల్లి మారుతీ ప్రసన్న, ప్రసూన రామన్ తదితరులు మాట్లాడుతూ అనురాగాల కల్పవల్లి తల్లి అని, నిష్కల్మషమైన,నిర్మలమైన కపటమెరుగని ప్రేమకు నిర్వచనం తల్లి అని అన్నారు. ఓర్పు, నేర్పు, సహనం, మమకారం, అనురాగం కలబోసిన మూర్తిత్వం మాతృత్వమని, తల్లి సదా పూజనీయురాలన్నారు.

స్వస్తిక్ ప్రోడక్ట్స్ ప్రారంభించిన కామ్న జెఠ్మలాని

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : నగరంలోని నాక్ కళ్యాణ మండపంలో స్వస్తిక్ రైస్ రిచ్ ప్రోడక్ట్‌ను ముఖ్యఅతిథిలుగా విచ్చేసిన సినీనటి కామ్న జెఠ్మలాని, మరో సినీ నటుడు ప్రస్సన్న కుమార్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ స్వస్తిక్ రైస్ రిచ్ ప్రోడక్ట్ ఎంతో నమ్మకమైనదని చాలా రుచికరమైనదని వివరించారు. స్వస్తిక్ రైస్ రిచ్ వాళ్ళు మేలు రకమైన విత్తనం నుంచి రైస్ ని పండిస్తారని వివరించారు. స్వస్తిక్ రైస్ లో ఎక్కువ ప్రోటీన్లు ఉంటాయని అందరూ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ ప్రోడక్ట్ ను ఎస్కే భాష, నాని లు వెలుగులోకి తీసుకువచ్చారని తరతరాలుగా ఈ బిజినెస్ లోనే కుటుంబమంతా ఉన్నారని తెలిపారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వస్తిక్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు నవీన్‌కుమార్ 20 సంవత్సరాల నుంచి ఈ ఫీల్డ్‌లో ఉంటున్నారని, అందరికీ నమ్మకమైన రైస్‌ను అందిస్తున్నారని తెలిపారు. స్వస్తిక్‌రైస్‌రిచ్ అభివృద్ధి కావాలని కోరుకుంటున్నానని ఆకాంక్షించారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు దస్తూరిపై పోటీలు

విశాలాంధ్ర-గంపలగూడెం : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండలంలోని పెనుగొలను శాఖ గ్రంథాలయంలలో ఆదివారం విద్యార్థులకు దస్తూరి పై పోటీలు నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఉమా . శేషి రెడ్డి, మరియు టి .నాగరాజులు ఈ పోటీలు నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ విభాగంలో విజేతలకు శ్రీ షిరిడి సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులచే ప్రపంచ కథలు చదివించి, చెప్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని వి. జ్యోతిర్మయి విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపమానాలతో కూడిన విద్యను బోధించాలి

విశాలాంధ్ర-ఘంటసాల : ఉపమానాలతో కూడిన విద్యను బోధిస్తే విద్యార్థుల భవిష్యత్తు బంగారు బాట అవుతుందని విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు జె లక్ష్మీపతి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొడాలి శాఖ గ్రంథాలయంలో 7వ రోజు సమ్మర్ క్యాంప్ గ్రంథాలయ అధికారి ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మీపతి మాట్లాడారు.

తాపి కార్మికుడు ఆత్మహత్య !

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడలో తాపి కార్మికుడు ఒర్సు ఏడుకొండలు (44) ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన కాకర్లవీధిలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివారాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు మద్యం సేవించి వాహనం నడుపుతున్న తాపీ కార్మికుడు ఒర్సు ఏడుకొండలును అపి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించినట్లు తెలిపారు. పట్టపగలు మద్యం సేవించి వాహనం నడుపుతావా అంటూ పోలుసులు మందలించినట్లు తెలిపారు. వాహనం లాక్కొన్న పోలీసులు ఫైన్‌కట్టి తీసుకెళ్లమని చెప్పడంతో మనస్థాపానికి గురైన ఏడుకొండలు తన ఇంటి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసునట్లు తెలిపారు. భార్య నర్సాలు మాట్లాడుతూ హనుమత్ జయంతి పండగ కావడంతో తన అనుమతితోనే భర్త ఏడుకొండలు మద్యం సేవించడానికి వెళ్ళాడని, తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత పోలీసులు బైక్‌ను లాక్కున్నారని కలత చెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఏడుకొండలు కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు.

మతిస్థిమితం లేని మహిళ మృతి

విశాలాంధ్ర-కూచిపూడి : కాజ గ్రామంలో మతిస్థిమితం లేని వృద్ధురాలు ఆదివారంకాలవలో పడి మరణించిన సంఘటన వెలుగు చూసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్సై డి సందీప్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన మాచర్ల లక్ష్మీకాంతం (66) సుమారు 45 సంవత్సరాల క్రితం నాగేశ్వరరావుతో వివాహమైంది. వివాహమైన సంవత్సరానికి మనస్పర్ధలతో పుట్టింట్లోనే ఉంటుంది. ఆరోగ్యం బాగుండకపోవడం, మనిషి జీవితం కూడా లేకపోవడంతో ఆదివారం ఉదయం సమీపంలోని కాలంలోకి దిగటంతో నీటిలో మునిగిచనిపోయింది. మృతురాలి తమ్ముడు వెంకటేశ్వర ఫిర్యాదుతో పోలీసులు శవాన్ని వెలికి తీసి పంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు పంపారు.

సూత్రా-ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : మే నెల 17 నుంచి నగరంలోని శేషసాయి కళ్యాణ వేదికలో ఫ్యాషన్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులు పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. రకరకాల దుస్తులు, డ్రెస్సులు, చీరలు, ఆభరణాలు, పాదరక్షలు, గృహోపకరణాలు, బ్యూటీ ఉత్పత్తులు, కాస్మెటిక్స్, గిఫ్ట్ ఆర్టికల్స్ మొదలైన ఎన్నేన్నో విభిన్నమైన ఉత్పత్తులను అందుబాటులో ఉంటాయన్నారు. ఎజాగ్రత్తలు పాటిస్తూ ప్రతిఒక్కరికీ ప్రవేశం ఉచితమని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా ప్రతినిధులు : ఎమ్మెల్యే కైలే

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వమండలంలోని మంత్రి పాలెం శివారు సూర సానిపల్లెకు వెళ్లే రహదారిని ఆదివారం ఎమ్మెల్యే కైలేఅనిల్ కుమార్ అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడితూ కే.ఎన్.ఐ నుంచి1.6 కిలోమీటర్ల దూరానికి ఈ రహదారిని అభివృద్ధికి నాబార్డు నిధులు 49 లక్షలతో అంచనాలు వేశామని అయితే టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు గుంటూరు రాలేదని దానిని రూ.70 లక్షలతో ప్రతి పాదనలు రూపొందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రోడ్డు వెడల్పును ఆయన దృష్టికి తీసుకురాగా రోడ్డు సర్వే చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఏవైనా సమస్యలు వస్తే ప్రజాప్రతినిధులుగా పరిష్కరించడమే తమ లక్ష్యం అని సూచిస్తూ ఆ దిశలో తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చిన పెద్ద చిన్న సమస్యలపై స్పందించి అధికారులకు వాటిపరిష్కారంకు ఆదేశిం చారు. గ్రామస్తులు కోరికతో వ్యక్తిగతంగా సమస్యలను పరిశీలించిన అనంతరం బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈయనతో పాటు సర్పంచ్ పంది కృష్ణ, వైస్ ఎంపీపీలు కందుల కోటేశ్వరరావు, డొక్కు వెంకటేశ్వరరావు, తహశీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి సుధా ప్రవీణ్, ఈ.వో.పిఆర్ .డి. వీర్ల సీతారామరాజు, పంచాయతీరాజ్ డి.ఇ.ఇ. టి. శ్రీనివాస్, పి ఆర్ ఏఈ బి. రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బైండ్ల జాతిని గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఎస్సీ,ఎస్టీల తరువాత బైండ్ల జాతి అతిపెద్దది నేడు అది అంతరించే ప్రమాదంలో ఉందని తక్షణం తమను గుర్తించి ప్రభుత్వం అదుకొవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బండ్ల సంఘం అధ్యక్షుడు మందపాటి పాపా రావు విజ్ఞప్తి చేశారు. అదివారం గాంధీనగర్లఓని ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ బైండ్ల సంఘం రెండవ మహాసభ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ మాదిగ మాల కులాలలో తాము పదో స్థానంలో ఉన్నామన్నారు. బైండ్ల సంఘానికి ప్రత్యేకంగా గుర్తింపకుండా తమను మాల,మాదిగ కులంలో చేర్చే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. ఇటువంటి చర్యలు వలన వల్ల మా జాతి రాబోయే కాలంలో అంతరించిపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మాల,మాదిగలకు కార్పరేషన్‌లు ఉన్నాయి వారి తరువాత అతి పెద్ద కులం బైండ్ల కులం తమకు కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా అతి చిన్న కులంగా ఉన్న రెల్లి కార్పోరేషన్ ఏర్పాటు చేశారని తమకు కుడా ఏర్పాటు చేయాలన్నారు. మా కులం లేకపోతే ఏ పూజ కార్యక్రమం కూడా జరగదు అటువంటి తమకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. జనన గణన కేంద్ర ప్రభుత్వము చేసే కార్యక్రమంలో భాగంగా ఎస్సీ,మాల మాదిగ అందరికీ జనాభా లేక్కలో ప్రత్యేక కాలం ఉంటుంది. అదే విధంగ తమకూ కుడా ప్రత్యేక కాలం కేటాయించాలని కోరారు.బైండ్ల కులానికి ప్రత్యేక గుర్తింపు కేటాయించాలని తాము కోరుతున్న న్యాయమైన కోరికలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చే విధంగా కృషి చేయాలని లేని పక్షంలో రాబోయే కాలంలో తమ ఉద్యమాన్ని తీవ్రతను చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలు జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతుకు భరోసా ఏదీ?

విశాలాంధ్ర-ఎ కొండూరు : అకాల వర్షాలతో త్రీవ్ర నష్టాన్ని చవిచూసిన మొక్కజొన్న రైతన్నకు రాష్ట్ర మార్కఫెడ్ సంస్థ కైలు చేసినా ఆరుదల మొక్క జొన్న ను క్వింటాల్ ధర రూ 1962 లకు కోనుగోలు చేస్తమనీ ప్రభుత్వం చెప్పడం తో మొక్క జొన్న రైతులు మాత్రం కొంత ఊరట లభించింది. అయితే గత కొద్ది రోజుల క్రితం ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలము లోనీ స్థానిక పి ఎ సి యస్ నందు మొక్కజొన్న కోనుగోలు కేంద్రాన్ని అయితే ఏర్పాటు చేసారు కానీ ఇంత వరకు మండలము లో ఉన్న ఒక్క మొక్కజొన్న విత్తనన్ని కూడా కొనుగులు ప్రారంభించలేదు అని రైతులు ఐతే వాపోతున్నారు మండలం లోని చీమలపాడు రెవిన్యూ పరిధిలో ఎక్కువ మొక్కజొన్న పంట ఈ క్రాఫ్ నమోదు అయినట్లు వ్యవసాయ శాఖ అధికారులద్వారా తెలుస్తుంది చీమలపాడు సహకార సంఘ పరిధిలోనే మరొక మొక్కజొన్న కొనుగోలు సెంటర్ ను ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని రైతులు అంటున్నారు ఏ సమయానికి ఏ విపత్తు వచ్చి పడుతుందో అని భయం గుప్పెట్లో ఉండవలసి వస్తుందని మొక్కజొన్న పంటను కల్లాలపై ఉంచి రాత్రి పగలు తేడా లేకుండా అక్కడే కాలం వెళ్లబోస్తున్నామని రైతులంటున్నారు కల్లలో ఆరబోసిన మొక్కజొన్న గింజలను త్వర తగిన కొనుగోలు చేసే విధంగా అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని మండలానికి చెందిన రైతులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ను ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మేయర్ భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ దేవినేని అవినాష్ ఆదేశాల మేరకు నియజకవర్గ పరిధిలోని 22వ డివిజన్ కృష్ణలంకలోని ఎస్‌వీ రెడ్డి నగర పాలక ఉన్నత పాఠశాలలో దేవినేని నెహ్రూ చారిటిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వర హాస్పిటల్ సహకారంతో ఆదివరం ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ శిభిరాన్ని నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్, రోడ్లు భవనాలు, వంతెనలు ఫ్లైఓవర్లు, డ్రెయినేజీలు ప్రత్యేక కమిటీ చైర్మన్ తాటిపర్తి కొండారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, పార్టీ రాష్ట్ర నాయకులు కడియాల బుచ్చిబాబు, విజయవాడ కార్పొరేషన్‌లో వైసీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగ అధ్యక్షులు కొరివి చైతన్య, ఎన్టీఆర్ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు చిమాటా సాంబశివరావు, వైసీపీ డివిజన్ అధ్యక్షులు జోగా రాజు వైస్సార్సీపీ నాయకులు రాజు, సొంగా రాజ్ కమల్, ఉమ్మడి ధనరాజ్, పులి రమణారెడ్డి, ఫేజాలుద్దీన్, జావీద్, ఆసీఫ్, నాగిరెడ్డి, ఏడుకొండలు, అంజిరెడ్డి, సురేష్, దనుంజయ్, నరేష్, గోపాలరెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీల పోరాటాలతోనే ...

కష్టజీవుల హక్కులు సాధిస్తాం

-బీజేపీ, వైసీపీలు ప్రజలకు చేసింది శూన్యం
-సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
-ఘనంగా జోడు బొమ్మల ఆవిష్కరణ
- ఆవిష్కరించిన సీపీఐ సీనియర్ నాయకులు రాంపిళ్ల అప్పారావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్/చిట్టినగర్) : కమ్యూనిస్టు పార్టీలు చేసిన పోరాటాలు, త్యాగాల ఫలితంగా కష్టజీవుల కొన్ని హక్కులనైనా సాధించుకోగల్గామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో శ్రామిక చిహ్నంమైన జోడుబొమ్మల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయవాడ పాతబస్తీ టైలర్‌పేట వద్ద సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. నూతనంగా ఏర్పాటు చేసిన జోడుబొమ్మలను సీపీఐ సీనియర్ నాయకులు రాంపిళ్ల అప్పారావు ఆవిష్కరించారు. ముందుగా కమ్యూనిస్టు పార్టీ పతాకాన్ని రామకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ భూముల కోసం, ఇళ్ళ స్థలాలు, ఇళ్ల కోసం పోరాటాలు చేసిందన్నారు. కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహించిందన్నారు. ఉద్యోగులు ప్రశాంతంగా జీవించటానికి కారణం ఎర్రజెండా పార్టీలు పోరాటాలు ఉన్నాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో ఏర్పాటు చేసి వందేళ్లకు దగ్గరవుతున్నా కేంద్రంలో అధికారంలోకి రాలేకపోయిందన్నారు. విజయవాడ నగరంలో రెండు సార్లు అధికారం చేపట్టి పేదల అభ్యున్నతి కోసం పని చేసిందన్నారు. కర్నాటక ఎన్నికల్లో 9ఏళ్ల ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీ భారతదేశానికి చేసింది ఏమీ లేకపోవటంతో జై భజరంగ్‌భళీ' అని ఓటు వేయమని చెప్పే స్థాయికి దిగజారీ పోయారని విమర్శించారు. ఎన్నికల్లో బహిరంగ సభలు, రోడ్ షోలలో ప్రసంగించిన మోదీ అధిక ధరలు, నిరుద్యోగం, నల్లధనం, వంటి సమస్యలను ప్రస్తావించకుండా మతాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. దేశంలో ప్రమాదకర రాజకీయాలు జరుగుతున్నాయని ఆందో ళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో లౌకిక పార్టీలు, ప్రజాతంత్ర పార్టీలు, కమ్యూనిస్టు పార్టీలు కలిసికట్టుగా పోరాటాలకు ముందుకు రావాలని కోరారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పిచ్చోడిచేతిలో రాయి చందంగా ఉందని ఎద్దేవ చేశారు. అధికారం ఉందికదా అని ప్రజావేదికను కూల్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని చెప్పారు. చంద్రబాబు ఇంటిని అటాచ్ చేసి కక్ష్య సాధింపు పాలన చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ప్రాజెక్టు కట్టలేదని, కాల్వ తవ్వలేదని, ఒక్కరికి ఉద్యోగం ఇవ్వలేదని వివరించారు. రాష్ట్రంలో 35శాతం విద్యావంతులు నిరుద్యోగులుగా ఉన్నారని చెప్పారు. సీపీఐ సీనియర్ నాయకులు రాంపిళ్ల అప్పారావు మాట్లాడుతూ కష్టజీవులకు పని భద్రత, కనీస హక్కులు, గౌరవప్రదమైన సాంఘిక జీవితాన్ని ఇచ్చింది కమ్యూనిస్టు పార్టీయే అన్నారు. టైలర్‌పేటకు అనేక కులాల శ్రమజీవులు వలస వచ్చారని వారిని చేరదీసి ఆదరించింది కమ్యూనిస్టు పార్టీయేనన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ కోట్లాది మంది శ్రమజీవులు ఎంత కష్టపడుతున్నా రేపటి పరిస్థితి ఏమిటి? అనే అభద్రతతో జీవిస్తున్నారని చెప్పారు. విద్య, వైద్యం, కార్పోరేటీకరణ అయిందన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రైల్వే, టెలికాం, విద్యుత్, బొగ్గు ఇన్సూరెన్సు, బ్యాంకుల ఇలా ప్రతిదీ ప్రైవేటీకరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కామ్రేడ్ ఎల్.వి.రత్నం, తుపాలకు సింహాచలం, బూరాడ సీతారామయ్య, రాంపిళ్ల కొండలరావు, సుకమంచి రంగారావు, దేవిన సింహాచలం, భూపతి ఎల్లారావు, తదితర నాయకులు కమ్యూనిస్టు పార్టీని నడిపించిన తీరును గుర్తు చేశారు.జోడు బొమ్మల నిర్మాణంతో శ్రామిక సాంస్కృతిక వాతావరణం ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు రాంపిళ్ల కొండలరావు, ఎర్రంశెట్టి బుచ్చమ్మ, చెరుకు అప్పలమ్మ లను వామపక్షాల నాయకులు దుశ్వాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్,, సీపీఐ నగరసహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు తాడిపైడియ్య, కార్పొరేటర్ బోయి సత్యబాబు, ఎంసీపీఐ(యు) నాయకులు ఖాదర్‌బాషా, న్యాయవాది రాంప్రసాద్, బోర్రా రామకృష్ణ రాంపిళ్ల కొండల రావు తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతోనే గుర్తింపు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: సేవాభావంతో పనిచేస్తే మంచి గుర్తింపును సాధించేందుకు అవకాశం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ప్రముఖులు జె.రంగారెడ్డి జీవితభీమా సంస్థ ఏజంటుగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురు వినియోగదారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ, రంగారెడ్డి కేవలం ఒక ఏజంటుగానే కాక, స్థానికంగా ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ, తన సొంత డబ్బుతో సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా సీనియర్ ఏజంటు యెరుబండి వెంకట్రావు దంపతులను తొలుత సన్మానించారు. సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ఉత్తమ మాతృమూర్తికి నిదర్శనం దోనేపూడి సరస్వతి

మాతృదినోత్సవం రోజున సరస్వతి ద్వితీయ వర్ధంతి సభలో శ్రద్ధాంజలి ఘటిస్తూ సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఉత్తమ మాతృమూర్తికి నిదర్శనం దోనేపూడి సరస్వతి అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ అన్నారు. సీపీఐ కృష్ణలంక 21వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సత్యం హోటల్ సెంటర్‌లోని సీపీఐ కార్యాలయం వద్ద ఆదివారం దోనేపూడి సరస్వతి ద్వితీయ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి, నగర, స్థానిక నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన అక్కినేని వనజ మాట్లాడుతూ అంతర్జాతీయ మాతృ దినోత్సవం రోజునే సరస్వతి ద్విదీయ వర్ధంతి సభలో పాల్గొనటం విచారకరమన్నారు. నేడు పార్టలో దోనేపూడి శంకర్ అంచలంచలుగా ఎదగటానికి కారణం ఆయన వెనుకుండి నడిపించిన సరస్వతే కారణమన్నారు. ప్రజా సమస్యలు, ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి శంకర్ చేసిన పోరాటాల్లో ప్రత్యేక్షంగా, పరోక్షంగా సరస్వతి సహకారం, ఆలోచనా విదానం ఆదర్శనీయమని అన్నారు. అనేక పార్టీ పోరాటాల్లో ఆటుపోట్లును ఎదుర్కొని సమస్యను పరిష్కరించటంలో ఆమె శంకర్‌కు చేదోడువాదోడుగా ఉండేవారని గుర్తు చేశారు. అప్పుడు, ఇప్పుడు ఆమె ఇచ్చిన దైర్యమే శంకర్‌ను నడిపిస్తున్నాయని, విజయవాడ నగరంలో సీపీఐ రెపరెపలాడాలని కోరుకున్న సరస్వతి నేడు మన మధ్య లేకపోవటం పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుముత్స దుర్గాభవానీ మాట్లాడుతూ ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనక పోయినా సీపీఐ ఎదుగుదలకు పరితపించేవారన్నారు. పార్టీకి సంబందించిన అనేక విషయాలు ఆమె పంచుకునేదని గుర్తు చేశారు. దోనేపూడి శంకర్ ఎదుగుదల వెనుక ఆమె కృషి అభినందనీయమని చెప్పారు. కుటుంబం పట్ల ఎంత శ్రద్ధతో ఉండేదో పార్టీ పట్ల కూడా అదే శ్రద్ధను కనపర్చి శంకర్‌కు అనేక విషయాల్లో సహాయ సహకారాలు అందించేవారని అన్నారు. పిల్లలను ఎంతో క్రమశిక్షణతో పెంచారని అలాంటి మాతృమూర్తితో మదర్స్‌డే జరుపుకోవాల్సిన రోజున ఆమె ఫోటోకు దండవేసి శ్రద్దాంజలి ఘటించటం విచరకరమన్నారు. దోనేపూడి శంకర్‌కు సరస్వతి ఇచ్చిన ప్రోత్సాహాన్ని పిల్లలు కూడా ఇచ్చి పార్టీ ఎదుగుదలకు సహకరించాలని ఆకాక్షించారు. అనంతరం దోనేపూడి సరస్వతి ద్వితీయ వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు, సీపీఐ 21వ డివిజన్ కార్యదర్శి మండలపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంకా దుర్గారావు, సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడియ్య, సీపీఐ కార్యవర్గ సభ్యులు సంగుల పేరయ్య, దోనేపూడి సూరిబాబు, ఈమని దాము, కొట్టు రమణారావు, కొడాలి ఆనందరావు, పీ.రాము, పాశం ఆంజనేయులు, మన్నెం సుబ్బయ్య, ఆటోవర్కర్స్ యూనియన్ నగర నాయకులు ఎర్రా రాములు, జనార్దన్, సుబ్రహ్మణ్యం, వెంకట్, డాక్టర్ దోనూపూడి సాయి చరణ్య, డాక్టర్ దేవరపల్లి వినయ్, స్థానిక పార్టీ నాయకులు పులి లక్ష్మణ, ఇటుకాల శివ, మానం ఏడు కొండలు, కనిగిరి కొండ, పార్టీ సభ్యులు, సానుభూతి పరులు, అభిమానులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగు ప్రకృతిని కాపాడండి కాలుష్యాన్ని నిర్మూలించండి

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : ప్రతిరోజు సైక్లింగ్ చేయటం ద్వారా ఆరోగ్యం మెరుగవుతుందని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) జిల్లా ఈఈ ప్రసాదరావు, సీపీఐ నాయకులు కె.వి భాస్కరరావు అన్నారు. ఏపీపీసీబీ, ఏపీఈఈసీ, సీపీఆర్ఈఈ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సైక్లింగ్ ర్యాలీని వారు సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో అవశ్యకం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ లైఫ్ లో భాగంగా సైక్లింగ్ తో పాటు 72 కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఈఈ తెలిపారు. ఏపీఈఈసీ డైరెక్టర్ కాకర్ల వెంకటరత్నం, తదితరులు సైక్లిస్టులను ఉద్దేశించి మాట్లాడారు. పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని సైక్లింగ్ చేశారు.

అమ్మ రుణం తీర్చలేనిది: మేయర్ భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : ప్రపంచంలో అమ్మ రుణం ఎప్పటికీ, ఎవరూ తీర్చలేనిదని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. మాతృ దినోత్సవ సందర్భంగా నక్కా కోటేశ్వరమ్మ, పొట్రు సుబ్బలక్ష్మి పేర్ల మీద నక్కా రాములు, కోటేశ్వరమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయవాడ గాంధీనగర్‌లోని కందుకూరి కళ్యాణ మండపంలో ఆదివారం వ్యవస్థాపక ట్రస్టీలు నక్కా వీరభద్రరావు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు చేయటం ద్వారా తల్లిదండ్రుల రుణం తీర్చుకునే అవకాశం లభిస్తుందన్నారు. నేడున్న పరిస్థితుల్లో తల్లి తండ్రిని పట్టించుకోని నేపథ్యంలో నక్క వీరభద్రరావు రాజ్యలక్ష్మి దంపతులు ఇద్దరూ ఒకే మాటతో గత కొన్ని సంవత్సరాలు ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇరువురు తమ అత్తమామలను గౌరవించుకుంటూనే సేవా కార్యక్రమాలను నిర్వహించడం అది కొన్ని సంవత్సరాలుగా ప్రజల ఆదరాభిమానాలు పొందటం గర్వకారణం అన్నారు. మరో అతిథి ఉమెన్ ప్రొటెక్షన్ ఎస్పీ కేజీవి సరిత మాట్లాడుతూ తల్లి రూపంలో శక్తి నిక్షిప్తమై ఉంటుందన్నారు. పెదవే పలికిన మాటల్లో తీయని మాటే అమ్మ మాధుర్యాన్ని తెలిపే పాటని గుర్తు చేశారు. ప్రతిరోజు కనిపించే దైవం తల్లి రుణం తీర్చుకుంటానికి ప్రపంచవ్యాప్తంగా మాతృ దినోత్సవ అవకాశం మనకు కల్పించారని అన్నారు. పేగు తెంచుకొని పుడితేనే తల్లి కాదని తల్లి తండ్రి లేని పిల్లలను అక్కున చేర్చుకుంటే తల్లి అయ్యే అవకాశం ఉందని అలాంటి మహాభాగ్యాన్ని పొందాలన్నారు. డాక్టర్ ఎం. సుధ మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్ ని ఏర్పాటు చేసి నిర్విరామ సేవా కార్యక్రమాలు చేయటం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం అతిథులను నిర్వాహకులు దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. అనంతరం మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకుల బంధువులు, స్నేహితులు, అభిమానులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో తెలంగాణ ఎమ్మెల్యే పోడం వీరయ్య

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారిని తెలంగాణ రాష్ట్రం భద్రాచలం ఎమ్మెల్యే పోడం వీరయ్య కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు అర్చకులు వేద పండితులచే ఆశీర్వచం చేసి అమ్మవారి శేష వస్త్రంలో తీర్థ ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కోలా రామారావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

తిరుపతమ్మ వజ్ర కిరీటంకు రూ.16,116 విరాళం

తిరుపతమ్మ అమ్మవారి వజ్ర కిరీటానికి ప్రకాశం జిల్లా ఎన్జీపాడు మండలం వినోదరాయునిపాలెం గ్రామ వాస్తవ్యులు చలువాది. సత్యనారాయణ అంజనీకుమారి దంపతులు రూ.16,116 విరాళంగా ఇచ్చారు. వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్, ఆలయ అర్చకులు వేద పండితులచే ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రాలు తీర్థ ప్రసాదములు అందజేశారు.

తిరుపతమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

తిరుపతమ్మ అమ్మ వారి ఆలయానికి ఆదివారం తెల్లవారు జామునుండే అమ్మ వారి ఆలయానికి భక్తులు చేరుకొని మున్నేటి లో తల స్థానాలు ఆ శ రించి. పాలపోంగల్లు పొంగించు కొన్ని పిల్ల పాపలతో అమ్మ వారిని దర్శించు కొన్ని మొక్కులు తీర్చు కూన్నారు. ఆదివారం కావడం తో వెలసంఖ్యలో భక్తులు రావడంతో భ క్తు లతో ఆలయం పోటెతింది.. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆలయ చైర్మన్ ఇంజం. కేశవ రావు. ఈఓ రమేష్ నాయుడు పర్యవేక్షించారు. గ్రామం లోకి వేలాది వాహనాలు రావడంతో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు రాకుండా స్థానిక ఎస్ ఐ. దుర్గా ప్రసాద్ .ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వ హించారు.

అన్నదానానికి రూ.15 వేలు వితరణ

విశాలాంధ్ర-వత్సవాయి : హనుమాన్ జయంతి పురస్కరించుకొని మండలంలోని తాళ్లూరు గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి... ఈ వేడుకలలో యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లా. శివరామకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు... జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి ఆయన 15 వేల రూపాయలు విరాళంగా అందజేశారు.. ఈ కార్యక్రమంలో షేక్ ఖాసిం సాహెబ్, షేక్ జానీ, చిట్టూరి. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకి సంఘీభావం : ఎమ్ఎస్.బేగ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : వైఎస్సార్‌సీపి ప్రభుత్వం చేస్తునటువంటి ప్రజా వ్యతిరేకం పాలనపై తలపెట్టిన యువ గళం పాదయాత్ర 100వ రోజుకి చేరుకున్న సందర్భంగా ఈ పాదయాత్రను జయప్రదం చేయవలసిందిగా పశ్చిమ నియోజకవర్గ నాయకుడు ఎమ్ఎస్.బేగ్ కోరారు. ఈ నెల 15వ తేదీన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుతో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం కు సంఘీభావంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సాయంత్రం 4 గంటల నుండి పాదయాత్ర నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర అనుబంధం విభాగాల సభ్యులు జిల్లా అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు డివిజన్ అధ్యక్షులు డివిజన్ కార్యదర్శులు కమిటీ, సభ్యులు క్లస్టర్ ఇన్చార్జిలు యూనిట్ ఇన్చార్జీలు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ పెద్దఎత్తున పాల్గొనవలిసిందిగా ప్రకటనలో పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పున:ప్రారంభించి పెండింగ్ క్లైములు వెంటనే చెల్లించాలని కోరుతూ 15వ తేది సోమవారం చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి పల్లా సూర్యారావు పిలుపునిచ్చారు. విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ఈ కార్యక్రమంలో నిర్మాణ కార్మికులు జిల్లా, టౌన్ నుండి విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. చిట్టినగర్‌లో రెడ్‌పొంగు ప్రభుదాస్ అధ్యక్షతన నిర్మాణ కార్మికుల డివిజన్ సమావేశము జరిగినది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కామ్రేడ్ కే. ఆర్.ఆంజనేయులు హాజరై ప్రస్తుత ప్రభుత్వాలు కార్మికుల పట్ల సవతి ప్రేమ చూపిస్తున్నాయని విమర్శించారు. కార్మిక చట్టాలను 4కోడ్ లుగా మార్చి కార్మికులను అధోగతి పాలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ చెల్లా వెంకటరమణ మాట్లాడుతూ కార్మికుల ఓట్లతో గద్దెనెక్కి కార్మికుల హక్కులను కాలరాస్తున్న ఈ దుర్మార్గపు పాలకుల కళ్ళు తెరిపించడానికి ప్రతి ఒక్క కార్మికుడు నడుము బిగించాలన్నారు. నూతన ఇసుక పాలసీ పేరుతో పనులు లేకుండా చేసి పరోక్షంగా రాష్ట్రం 42 మంది కార్మికులు ఆత్మహత్యలకు కారణమైన ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఈ సమావేశంలో యూనియన్ కార్యదర్శి కామ్రేడ్ చీర్ల రామస్వామి, నాయకులు ఎస్కే అమీర్, జి ప్రకాష్, రాజా బుర్రే శివ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడు...
ముద్దుకృష్ణ మృతికి సీపీఐ సంతాపం

విశాలాంధ్ర-తిరువూరు: సీనియర్ పాత్రికేయుడు కిలారు ముద్దుకృష్ణ హఠాన్మరణం పట్ల సిపిఐ నియోజకవర్గ సమితి సంతాపం తెలిపింది. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య, నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిలుకూరి వెంకటేశ్వరరావు తదితరులు ఆదివారం ముద్దుకృష్ణ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తిరువూరు నియోజకవర్గంలో ఆయన వార్తల ద్వారా అనేక సమస్యలను వెలుగులోకి తెచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేశారని కృష్ణయ్య తెలిపారు. సీపీఐ తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఏ కొండూరు మండల కార్యదర్శులు, నృసింహాద్రి వనమాలి, సాంబశివరావు, ఎం త్యాగరాజు, ఎం దేవిడ్, తిరువూరు పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఇతర ప్రజా సంఘాల నాయకులు కొత్తపల్లి సుందర్రావు, ఎస్కే సుభాని, ఎస్కే నాగుల్ మీరా కార్పెంటర్, సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

పశ్చిమలో కాపు కళ్యాణ మండపం

-కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు
- ఎస్వీ రంగారావు కాపు సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో త్వరలో కాపు కళ్యాణ మండపం నిర్మాణం చేపడతామని రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు తెలిపారు. స్థానిక భవానీపురం 45వ డివిజన్లో ఓ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం ఎస్వీ రంగారావు కాపు, తెలగ, బలిజ, ఒంటరి సంక్షేమ సంఘం నూతన కమిటీ నియామకం జరిగింది. నూతన అధ్యక్షుడిగా పదిలం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా లింగం శివప్రసాద్, ఉపాధ్యక్షులు దారపురెడ్డి ఉదయ్‌భాస్కర్, కోశాధికారిగా జవ్వాజి కొండలరావు, సహాయ కార్యదర్శి జోషి కిరణ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చిరంజీవి, దాసరి రవి, ముత్తా వాసు, పి. సతీష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు సంఘ సభ్యుల ఎదుట ప్రమాణస్వీకారం చేశారు. కాపు నాయకులు పిట్టల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కాపు నాయకులు, కార్పొరేటర్లు పాల్గొని ఎస్వీ రంగారావు కాపు, తెలగ, బలిజ, ఒంటరి సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో కాపు కళ్యాణ మండపం నిర్మాణం చేయాల్సి ఉందని, స్థలం విషయమై స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు పదిలం రాజశేఖర్, లింగం శివప్రసాద్ మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. సంఘం యొక్క బలోపేతానికి శాయశక్తుల తోడ్పడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, యలకల చలపతిరావు, మైలవరపు మాధురి లావణ్య, మైలవరపు దుర్గారావు, మైలవరపు కృష్ణ, అత్తలూరి పెద్ద బాబు, అమ్మిశెట్టి వాసు, కాపు సంఘం నాయకులు గుసుగులా పుల్లయ్య, పత్తి నాగేశ్వరరావు, వడ్లాని మాధవరావు, నవ్యాంధ్ర కాపు సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరావు, వాసా ఆదినారాయణ, సంఘం ఉపాధ్యక్షులు ఉదయ్ భాస్కర్, సహాయ కార్యదర్శి తంగా రవి కుమార్, పశ్చిమ నియోజకవర్గ కాపు సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ఆరోగ్యమే మహాభాగ్యమని అది నడకతో సాధ్యమని జిల్లా వాకర్స్ క్లబ్ గవర్నర్ డివియస్ రామలింగరాజు అభిప్రాయపడ్డారు. ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని బిఆర్‌టిఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మధురానగర్ రమాదేవి మున్సిపల్ స్కూల్ ప్రాగణంలో మెగా హెల్త్ క్యాంప్‌ను గౌతమ్ క్లినిక్ డాక్టర్ గౌతమ్ కృష్ణ,డాక్టర్ సుకీర్తిలతో నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా అవసరమైన వారికి మందులు అందించారు. తొలుత వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, డివియస్ రామలింగరాజు పారంభించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో జిల్లా వాకర్స్ క్లబ్ కేబినెట్ కార్యదర్శి పి వి డి ప్రసాద్, కోశాధికారి సాయిబాబు, బిఆర్‌టిఎస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు గుర్రం ఏడు కొండలు, కార్యదర్శి కొండాయ గుంట రాము,కోశాధికారి డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్,కాటూరి రంగ నాథ్, వేరంకి గోకర్ణస్వర రావు,వ్యాస్,పిల్లి లక్ష్మి తులసి, శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఏపీ జెన్ కో రికార్డు!

- ఒకేరోజు 105.620 మిలియన్ యూనిట్ల సరఫరా
-5137 మెగావాట్ల విద్యుదుత్పత్తి - చరిత్రలో అత్యధికం
- ధన్యవాదాలు తెలిపిన ఎండీ చక్రధర్ బాబు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ విద్యుదుత్పత్తిలో సరికొత్త రికార్డు సృష్టించింది. శనివారం 105.620 మిలియన్ యూనిట్ల (5137 మెగావాట్ల) విద్యుదుత్పత్తి నమోదు చేసింది. శుక్రవారం అర్ధరాత్రి 12 నుంచి శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకూ సుమారు 114 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేయగా జెన్ కో వినియోగానికి పోనూ 105.620 మిలియన్ యూనిట్లు గ్రిడ్ కు సరఫరా చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత ఒకరోజులో ఇదే అత్యధిక ఉత్పత్తి కావడం విశేషం. అత్యధిక విద్యుదుత్పత్తి చేయడానికి అన్ని విధాలా సహకారం అందించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, ఇంధన శాఖ మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డికి, కేంద్ర రైల్వే , కోల్ మంత్రిత్వ శాఖల అధికారులకు ఏపీ జెన్ కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయన ఆదివారం ఈమేరకు ట్వీట్ చేశారు.

మరింత అంకిత భావంతో పని చేయండి: ఎండీ

రికార్డు స్థాయి ఉత్పత్తి సాధించినందుకు ఏపీ జెన్ కో ఉద్యోగులను మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్ బాబు అభినందించారు. వేసవి తీవ్రత నేపథ్యంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని గరిష్ట స్థాయిలో ఉత్పత్తి చేసి రాష్ట్ర అవసరాలను తీర్చడానికి మరింత అంకిత భావంతో పని చేయాలని ఉద్యోగులకు ఉద్బోధించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండు పెరుగుతున్నందున ఉత్పత్తి పెంచేందుకు ప్రభుత్వ సహకారంతో ఏపీ జెన్ కో అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ఎండీ పేర్కొన్నారు. వీటీపీఎస్ లో 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించిన కొత్త యూనిట్ విద్యుదుత్పత్తి త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. లోయర్ సీలేరులో మరో 230 మెగావాట్ల ఉత్పత్తి కోసం రెండు యూనిట్ల నిర్మాణ పనులు త్వరగా చేపట్టి ఏడాదిలో పూర్తిచేసేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు.

మాంసం దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : మున్సిపల్ కమిషనర్ ఆదేశములతో ఏర్పాటు చేయబడిన శానిటేషన్ ప్రత్యేక టీములు పురపాలక సంఘ పట్టణ పరిధిలో ఆదివారము ఉదయం చికెన్, మటన్ మరియు చేపల దుకాణములను తనిఖీ చేసారు. జంతులను వధించే ప్రదేశములు మరియు అమ్మకాలు జరిపే ప్రదేశములు పరిశుభ్రం గా ఉండెలా చూసుకొనవలెనని, మరియు మాంసము కొరకు వధించే జంతువులు ఆరోగ్యవంతమైనవిగా ఉండేలా చూసుకొనవలెనని, ప్రతి జంతువు వెటర్నెరీ డాక్టర్ వారి చేత ఆమోదముద్ర పొందిన తదుపరి మాత్రమే వధించి వాటి మాంసము అమ్మకాలు జరపవలెనని హెచ్చరికలు జారీచేసారు. మున్సిపల్ నిబంధనలు మేరకు అనుమతించిన షాపులు మాత్రమే అమ్మకాలు జరపవలెనని, ఇందుకు భిన్నముగా ప్రవర్తించే దుకాణముల యొక్క లైసెన్సులు రద్దు పరచడమే గాక ఆహార భద్రత ప్రమాణముల చట్టం మరియు మున్సిపల్ చట్ట ప్రకారము కఠిన చర్యలకు దుకాణముల యజమానులు భాధ్యులగుదురని మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు హెచ్చరికలు జారీ చేసారు.

స్వర్గపురిలో కార్యాలయం ప్రారంభించిన కార్పొరేటర్ కొండారెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : కృష్ణలంక 22వ డివిజన్ స్వర్గపురిలోని ఎలక్ట్రికల్ విభాగంలో ఆదునీకరించిన ఆఫీస్ రూమ్‌ను స్థానిక కార్పొరేటర్, రోడ్లు భవనాల వంతెనలు ఫ్లైవర్లు డ్రైనేజీలు ప్రత్యేక కమిటీ చైర్మన్ తాటిపర్తి కొండారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వార్గపురిలోని ఆఫీస్ రూమ్‌కు సీలింగ్ పనులు, రేకులు, పెయింటింగ్ పనులు, ఆఫీసు మరమ్మతులు నిర్వహించి రూ.2 లక్షల 70వేలతో ఆదునీకరించినట్లు తెలిపారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, గ్రంథాలయ అధికారులు మధు పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణలో భాగంగా ఆదివారం గ్రంథాలయంలో విద్యార్థులు చతక మంజరి, వేమన, సుమతి, విద్యాపుస్తకాలు చదివారు. వాటి విలువలను హెచ్ఎం కె.రామారావు విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు.